# కొత్త రచయితలు

## లవ్ స్టోరీ

### ఓ బుద్ధుడి ప్రేమ కథ

కాలేజీలో చేరి అప్పుడే సంవత్సరం గడిచిపోయిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. కాని కాలం ఆగదు కదా! ఆలోచనల్లోపడి మెల్లిగా నడుస్తున్న నన్ను అకస్మాత్తుగా ఓ రోజు అందమైన అమ్మాయి ఎవరో తరుముతున్నట్టుగా వచ్చి ఢీ కొట్టింది.

ఆశ్చర్యపోయి చూస్తున్న నాకు కిందపడ్డ పుస్తకాలు తీసుకుని హడావుడిగా వెడుతూ కనిపించింది. విషయం అర్థం కాక నేను నడవడం మొదలుపెట్టాను. కాలేజీకి వెళ్ళే కంగారులో నన్ను గమనించలేదు కాబోలు...ఛ కనీసం నేనైనా చూసుండాల్సింది. ఏది.ఏమైనా ఆ అమ్మాయి పదే పదే గుర్తుకు రాసాగింది. ఆమె రాసుకున్న సెంటు వాసన ఇంకా నన్ను వదిలిపోలేదు. తన్మయత్వాన్ని అనుభవిస్తూ బస్టాండ్‌లో నిలబడ్డాను.

నాకు కొద్ది దూరంలో ఆమె నిలబడి వుంది. ఆమెనే చూస్తున్నాను. అందమైన కళ్ళు, ఎర్రటి పెదాలు, పొడవైన జడ, కవులు పొగిడే అందాలు అన్నీ ఆమెలో కనిపిస్తున్నాయి. ఓరగా నావైపు చూసింది. అప్రయత్నంగా సన్నగా నవ్వాను. చటుక్కున చూపులు మరల్చుకుంది. ఇంతలో బస్ రావడం, హడావుడిగా ఎక్కడం జరిగిపోయాయి. అంతే ఆమె గురించి మర్చిపోయాను.

మరొక రోజు మా కాలేజీలో మళ్ళీ ఆమె కనిపించేసరికి ఆశ్చర్యపోయాను. వెళ్ళి పలుకరిద్దామని రెండు అడుగులు వేసానో లేదో పులిని చూసిన జింకలా పారిపోయింది.

కాలేజీలో రోజూ చూస్తూ ఊరుకోవడం అంటే మనస్సు ఒప్పండం లేదు. ఎలాగైనా సరే ఆమెతో మాట్లాడాలి అనుకుంటున్నాను కాని నేను కనిపిస్తేనే పారిపోతోంది ఎలా మాట్లాడాలి...?

ఆమె ఎందుకు అంతగా ఆకర్షిస్తూందో తెలియడం లేదు. నా హృదయమంతా ఆమె రూపంతో నిండిపోయింది.

ఇలాగే గడుస్తున్నాయి రోజులు.

లీజర్ పిరియడ్ కావడంవల్ల క్లాసులో స్టూడెంట్స్ అంతగా లేరు. కూర్చుని రాసుకుంటున్న నాకు చిరుమువ్వల శబ్దం లయబద్ధంగా వినిపిస్తే తలెత్తి చూశాను. ఆనందం, ఆశ్చర్యం. ఆమె నా వైపు వస్తోంది. నా గుండె చప్పుడు స్పష్టంగా నాకే వినిపిస్తోంది. చేతిలో పెన్ను కింద పడింది' "హలో..." అంటూ పలకరించబోయాను. నన్ను చూడనట్టే మా క్లాసుమేట్ సంధ్య దగ్గరికి వెళ్ళి ఏదో మాట్లాడి వెళ్ళిపోయింది.

అంటే వీళ్ళు స్నేహితులన్నమాట. అయితే మనం ఇట్నుంచి ప్రొసీడ్ అవ్వచ్చు! అనుకుంటూ వెళ్ళి సంధ్యను పలకరించాను.

"ఏమిటి మహానుభావా పలుకరించినా పలుకని వాడివి నువ్వే వచ్చావంటే విశేషమే" సంధ్య అంది.

"పనే వుంది! చిన్న ఇన్‌ఫర్మేషన్ కావాలి చెబుతావా?" అడిగాను.


"నీకు ఇన్‌ఫర్మేషన్ ఇచ్చేంతటి దాన్నా?"

"అయితే సరే నిన్నేమీ అడగనులే" వెనక్కి రాబోయాను.

"సర్లే ఏమిటో అడుగు" నాకు తెలుసు మళ్ళీ పిలుస్తుందని.

"ఇందాక వచ్చిందే ఒక అమ్మాయి...నీకెలా తెలుసు?"

"ఏమిటి దాన్ని గురించి అడుగుతున్నావు? కొంపతీసి సైట్ కొడుతున్నావా?"




రచయిత్రి చిరునామా
అఖిల
3-6-72
గుడిబండల్, హన్మకొండ
506 001
వరంగల్ (జిల్లా)


"నిన్ను అడగడం బుద్ధితక్కువ. అడిగింది చెబుతావా, నన్నెళ్ళమంటావా" చిరాగ్గా అడిగాను.

"నీ యిష్టం! వెడితే వెళ్ళు!"

'అమ్మో ఘటికురాలే కనిపెట్టేసింది!' అబ్బే మరేం లేదు. ఎక్కడో చూసినట్టు వుంటేను అడిగాను. ప్లీజ్ చెప్పవా?"

"అలా రా దారికి! నన్నే దబాయిస్తావా? అది నా క్లాస్‌మేట్. చిన్నప్పటి నుండి కలిసి చదువుకున్నాం. ఇంతకు ముందు వేరే ఊళ్ళో వుండే వాళ్ళు ఈమధ్యే ట్రాన్స్‌ఫర్ మీద ఇక్కడికి వచ్చారు. అదీ సంగతి! చాలా? ఇంకేమైనా కావాలా?"

"మరి మీ క్లాస్‌మేట్ కదా, మన క్లాస్‌కు రావడం లేదు-కొంపతీసి మధ్యలో ఎప్పుడైనా 'డుమికి' (ఫెయిల్) కొట్టిందా ఏమిటి?"

"అది నీకన్నా క్లవర్ స్టూడెంట్ తెలుసా! తెలుగు మీడియం మనది. ఇంగ్లీషు మీడియం దానిది" కొంచెం కోపంగా అంది.

"సారీ సంధ్యా! మీ ఫ్రెండ్‌ను తక్కువ అంచనా వేసాను. వస్తా" అంటూ వచ్చేసాను. అప్పటికే చాలా అడిగాననుకున్నాను. బయటికి వచ్చిన తరువాతగాని అర్థం కాలేదు పేరు అడగడం మరిచినట్టు. ఇప్పటికే మింగేసేలా వుంది. పేరడిగితే ఇంకేమైనా వుందా? కనీసం పరిచయం చెయ్యమన్నా బాగుండేది. అబ్బో! పేరు అడగడానికే సంకోచిస్తున్న వాణ్ణి. పరిచయం కూడానా?

ఎలా పరిచయం చేసుకోవాలాని ఆలోచిస్తున్నా. ఉన్న ఒక్క మార్గం సంధ్య. అడగాలంటే మొహమాటంగా వుంది. ఇలాగే అనుకుంటూ రోజులు గడిపేస్తున్నాను. ఆమె గురించి ఏమేమో కలలు కంటున్నాను. ఇదంతా వ్యర్థం అని తెలుసు. తెగించి మాట్లాడబోతే నిలబడదు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు.

క్లాసులో ఏదో రాసుకుంటున్నాను. అదే మువ్వల శబ్దం. చివ్వున తల ఎత్తాను. ఇంకెవరు- ఆమే! నా ఆరాధ్య దేవత. ఇప్పుడు వెళ్ళి పలక రిస్తేనో...

...మాట్లాడకపోతే భరించలేను...మాట్లాడకుండా వుండేదెలా.

"వెంకట్...వెంకట్...విన్నేనయ్యా మహాశయా" ఎదురుగా సంధ్య. "ఆ...ఏమిటి" తడబడుతూ అడిగాను.

"ఊహల్లోంచి కాస్త ఈ లోకంలోకివస్తావా... ఇదిగో ఇది నా ఫ్రెండ్ శిరీష" పరిచయం చేసింది.

"హలో...నమస్తే" కలో నిజమో తెలియడం



లేదు.

"నేచెప్పానే వెంకట్ అని మంచి కార్టూనిస్టు..." నా గురించి చెబుతోంది.

"నమస్తే" రెండు చేతులూ న్రమతగా జోడించి తియ్యగా అంది.

"దీనికి కార్టూన్లు నెర్చుకోవాలని వుందట. నీ దగ్గరికి తీసుకొచ్చాను" అంది సంధ్య.

"అబ్బే నేనేమంత పెద్ద కార్టూనిస్టుని కాదు లెండి" అన్నాను.

"మీ కార్టూన్లు చూశాను. మీకొచ్చిందే నాకు నేర్పించండి" 'ప్లీజ్' అన్నట్టు చూసింది. అలా అడిగిన తరువాత కాదంటానా! అసలు శిరీష ఎలా అడిగినా కాదనను కదా! అలా మొదలైంది మా పరిచయం. కార్టూన్లు ఎలా గీయాలో తెలుసుకుంది తప్ప నా మనస్సులోని మాట తెలుసుకోలేదు. ఎలా తెలుస్తుంది నేనేమైనా మనస్సు విప్పి చెపితేకదా! అన్ని విషయాలూ మాట్లాడుకుంటాం. రాజకీయాల గురించి, సినిమాల గురించి...ఇలా అప్పుడప్పుడు ప్రేమ గురించి కూడా మాట్లాడుతుంది. ప్రేమమీద సదభిప్రాయం వున్నట్టుగా మాట్లాడుతుంది అంతలోనే వ్యతిరేకిస్తున్నట్టుగా. ఎలా అర్థం చేసుకోవాలో అర్థం కావడం లేదు.

ఆ రోజు ఆనందంగా నా దగ్గరికి వచ్చింది. తను వేసిన కార్టూన్ అచ్చయ్యింది. మొదటి కార్టూన్ అనుభవం, ఆనందం నాకు తెలియనిదా! సంధ్యనూ, నన్నూ సినిమాకు తెసికెళ్ళింది.

"అయితే సినిమాతోనే సరిపెడదామనుకుంటున్నావన్నమాట" అడిగాను.

"సరిపోకపోతే ఏం కావాలో అడుగు"

"ఏం కావాలన్నా ఇస్తావా?"

"నువ్వు అడిగితే అంత కన్నానా"

"నీ మనస్సు నాకియ్యి శిరీషా!" అడిగావనుకున్నాను-నోట్లోంచి మాట బయటికి రాలేదు.

"ఏమిటే పెద్ద పెద్ద వాగ్దానాలు చేస్తున్నావ్. ఒక వేళ అడగరానిదే అడిగితే ఇస్తావా ఏమిటి" అంది సంధ్య.

"ఆ మాత్రం సంస్కారం లేనివాడు కాదే వెంకట్! నాకా నమ్మకం వుంది."

ఇంకేం అడుగుతాను! లాభం లేదు. నిద్ర పట్టడం లేదు. ప్రేమిస్తున్నాను అని చెప్పడానికి ఇన్ని తంటాలా? నోటు పుస్తకం తిరగేస్తుంటే రెపరెపలాడుతున్న కాగితం తీసి చూశాను-

డియర్ వెంకట్

ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడం లేదు. ఇలా ఎన్నిరోజులు నా మూగ ప్రేమని దాచుకోను... నువ్వంటే నాకిష్టమని ఎలా చెప్పను...మగాడివి నువ్వే చెప్పలేని విషయం ఎలా చెప్పేది...అర్థం చేసుకుంటే సాయంత్రం పబ్లిక్ గార్డెన్‌లో నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను...

నీ......

సంతకం లేదు. కాని రాసింది ఎవరో తెలియదా...యా...హూ...గాలిలో ఎగిరేదా...నీటి మీద నడిచేదా...ఎలా ఆపుకోను ఆనందం. సాయంత్రం నీట్‌గా తయారై వెళ్ళాను. నా కోసం ఎదురు చూస్తూ శిరీష...

హలో పలుకరించాను. ఎవరైనా చూస్తారేమోనని కంగారు పడుతోంది.

"ఏదో మాట్లాడాలి అన్నావు తొందరగా చెప్పు" అంది శిరీష. ఆశ్చర్యపోతూ అడిగాను "నువ్వే రమ్మని రాసావు-ఇదిగో ఉత్తరం" చూపించాను.

"నేనా..." విస్తుపోతూ వుత్తరం అందుకుని చదివి తనో ఉత్తరం తీసి ఇచ్చింది. మ్యాటర్ ఇద్దరిదీ ఒకేలా వుంది. అందులోనూ కింద పేరు లేదు. చేతిరాత ఒకటే.

"ఎవరు రాసి వుంటారు?" శిరీష అంది.

అదే నాకూ అర్థం కావడం లేదు. సంధ్యగాని ఈ పని చెయ్యలేదు కదా! అయినా సరే ఇంత దూరం వచ్చి వుత్తినే వెళ్ళడమా

"శిరీషా! నిన్నో విషయం అడగనా"

"అడుగు"

"నేనంటే నీకిష్టమేనా" ఎప్పటినుంచో అడగాలనుకుంటున్న మాట. "ప్లీజ్... మాట్లాడు..."

"ఊ..." అంది ముసి ముసిగా నవ్వుతూ. ఇంకేం-మనస్సులు కలిశాయి. మనువు కోసం ఎదురుచూడ్డం. అంతదాకా ప్రేమించుకోవడం.

కాని ఉత్తరం సంగతి తెలియాలిగా. సంధ్య రాత కాదని నిర్ధారణ అయిపోయింది. మరి ఎవరై వుంటారు?

పార్కులో కూర్చుని శిరీష నోట్సు తిరగేస్తున్న నాకు ఇంతకు ముందు పరిచయమైన అక్షరాల్లా వుంటే ఒక్కసారి తళుక్కున మెరుపు మెరిసింది. శిరీషే రాసి...

అదే అడిగాను. "ఏం చెయ్యమంటావు! నువ్వేమో చెప్పలేవు నేనూ చెప్పలేను. అలా చెయ్యమని సంధ్య సలహా యిచ్చింది చేశాను అంతే!"

"అమ్మదొంగా అంత యిష్టమే. మరి పలకరిస్తే పారిపోయేదానివి..."

"నువ్వింత బుద్ధూవని తెలియదుగా!"

మరి ఎలా తెల్సిందంటే సంధ్య చెప్పిందట కార్టూన్స్ గీయడం అసలు తనకు రానే రాదట- అది నాటకమే! ఎందుకంటే పరిచయం కోసం సంధ్య అలా చెప్పించిందట. ఇలా ఎన్ని నాటకాలు ఆడారో అన్నీ వివరంగా చెబుతోంది. "సంధ్య సలహాల మీదనే సుమా" అంటూ, అన్నీ చెప్పాక "బుద్ధూ ఐ లవ్ యూ" అంటూ నవ్వింది. *



పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్